# కలసివుందామా?

**- జి.రామలక్ష్మి**

''జయా.. జయా..'' అరుస్తున్నట్లే పిలుస్తూ గదిలోకి వచ్చాడు సుధీర్- జయ పలకలేదు. మూతి ముడుచుకుని కూర్చుంది.

''ఉదయం నుంచి అన్నం కూడా తినకుండా అలిగి కూర్చున్నావట! ఇప్పుడేం జరిగిందని?'' కోపంగా అడిగాడు భార్యని సుధీర్.

''చెప్పానుగా, నేను చెప్పినట్లు వింటేనే కానీ పచ్చి గంగయినా ఈ యింట్లో ముట్టననీ..'' కోపంగా అంది ఆమె.

''ఇది నీ అత్తారిల్లు..''

''కాదు, ఓ నరకకూపం. నాకు ఇక్కడ ఉండటం ఇష్టంలేదు. వేరింటి కాపురానికి మీరు ఒప్పుకునేదాకా నేను నీళ్ళుకూడా తాగను'' ఖచ్చితంగా చెప్పింది.

''అసలే కడుపుతోవున్న మనిషివి! ధస్తావు, కడుపు మాడ్చుకుని కూర్చుంటే-'' హెచ్చరిస్తున్నట్లుగా అన్నాడు.

''అయినా ఫర్వాలేదు. ఈ నరకంలో కాపురం చేయటంకంటే చావేనయం.''

''నీవెంత చెప్పినా, ఏడ్చినా, చచ్చినా నేను వేరింటి కాపురం పెట్టను'' అమ్మానాన్నలని, పెళ్ళికావల్సిన చెల్లెళ్ళీ, చదువు మధ్యలో ఉన్న తమ్ముడినీ వదిలీ చచ్చినా బయటికి రాను.''

''అయితే నేను మా యింటికి వెళ్ళిపోతా-''

''మా బేషుగ్గా వెళ్ళు..'' అంటూ రెక్క పుచ్చుకుని లాగుతూ బయటవరకు తీసుకెళ్ళి అవతలకు నెట్టేసి- తలుపేసేసుకున్నాడు.

తల్లీ, తండ్రీ, తమ్ముడు, చెల్లెలు వీళ్ళంతా చూస్తున్నా- ''మీరెవరూ ఏం మాట్లాడకండి..'' అంటూ తనగదిలోకి వెళ్ళిపోయాడు సుధీర్.

• • •

జయ- పుట్టింటికి వచ్చీ, అప్పుడే నాలుగు రోజులయింది. అత్తింటి నుంచి ఎటువంటి పిలుపూ లేదు. జయకి ఆ విచారమూ లేదు. హాయిగా ఉంది పెళ్ళి కానిదానిలా. వీక్లీ చదువుతూ వంటింటివైపు, అన్నయ్య గదిమీదిగా, వచ్చింది జయ, దాహం వేస్తూంటే మంచినీళ్ళకోసమని. గదిలోంచి మాటలు- కాదు, అరుపులు లాంటివి వినిపించీ ఆగింది. ఓ చెవివేసి అన్నావదినల మాటలు ఆలకించసాగింది.

''చూడండి- నేను మీకు చాలారోజుల నుంచి శంఖం ఊదినట్లుగా మీ చెవిదగ్గర పోరుపెడుతున్నాను మనం వేరే వెళ్ళిపోదామని. అయినా మీరు వినిపించుకోటంలేదు. ఇలాఅయితే, నేను మా పుట్టింటికి వెళ్ళిపోతా ఆ ..'' అరుణ అంది.

మోహన్ ఇంకా గట్టిగా అరిచాడు- ''నేనూ చెప్పా నీకు, ఎన్నోసార్లు, అది జరిగేపని కాదని. నాకు అమ్మానాన్నలు ఇంకా చదువుకుంటున్న ఇద్దరు తమ్ముళ్ళు ఉన్నారు. వాళ్ళందరి బాధ్యతా ఈ యింటి పెద్దకొడుకుగా నాదే! అదికాదని నేను బయటకు రాను, వచ్చినా మనశ్శాంతిగా నీతో బ్రతకనూలేను.''

''అంతేనా మీమాట..'' నొక్కిస్తూ అడిగింది అరుణ.

''అవును..'' ఖచ్చితంగా చెప్పాడు మోహన్.

''మీ చెల్లెలు కూడా వచ్చేసి ఇంక ఇక్కడే సెటిలైపోయింది. దానికి తగ్గట్లు కడుపుకూడా. ఆ ఇద్దర్నీ- ఈ నలుగుర్నీ చూసుకుంటూ మీ బాధ్యతలు నెరవేర్చుకోండి. రేపు తెల్లారే నేను వెళ్ళిపోతా.. ఇక రాను'' ఏడుస్తూ అంది అరుణ.

''ఓ.కె. థాంక్స్.. వెళ్ళు.. ఇకరాకు. కనీసం నీ బాధ్యత అయినా నాకు తప్పుతుంది.'' అంటూ లైటు ఆర్పి, మంచానికి ఓవైపున అటు తిరిగి పడుకున్నాడు. వదిన ఏడుస్తూ బయటికి వచ్చినా రావచ్చు. తనని చూస్తే బావుండదు అనుకుంటూ జయ వంటింటివైపుకి గబగబా నడిచి వెళ్ళింది. నీళ్ళుతాగి వచ్చి పడుకుంది. ఆమెకు నిద్దర రావటంలేదు. అటూ ఇటూ మంచం మీద పత్తిగిల్లుతూ ఆలోచనలో పడింది.

ఆ ఆలోచన ఎప్పటికోకానీ తెమిలింది కాదు. చివరికి ఓ నిర్ణయానికి వచ్చాకా కునుకుపట్టింది. ఉదయం జయ లేచేసరికి చాలాపొద్దుపోయింది. తల్లి హాల్లో సోఫాలో కూర్చుని ఏడుస్తూంది. తండ్రి ఓదారుస్తున్నాడు. అన్నయ్య ఆఫీసుకనీ తయారవుతున్నాడు. తమ్ముళ్ళిద్దరూ స్కూళ్ళకి వెళ్ళిపోయినట్లున్నారు. అరుణ ఎక్కడా కనిపించలేదు. అదేమాట వచ్చి తల్లిని అడిగింది జయ ''అమ్మా వదిన ఏదీ?'' అంటూ.

ఎవరూ ఏమీ మాట్లాడలేదు.

జయ మళ్ళీ రెట్టిస్తూ అడిగింది. అప్పుడు వర్ధనమ్మ అంది- ''మీ వదిన అలిగీ పుట్టింటికి వెళ్ళిపోయింది. ఈ ముసలాళ్ళూ- మీ తమ్ముళ్ళూ- నువ్వూ, దానికి భారం అయిపోయామట! మొగుడ్ని వేరింటి కాపురం పెట్టుకుందాం అంటూ తెగ సతాయిస్తుంది లే! ఆఖరికి ఈరోజు పెట్టేబేడా తీసుకుని చక్కాపోయింది. వీడూ వెళ్ళిపోతాడట దాంతోపాటు. ఇంక మేమెందుకు బ్రతకాలీ, ఎవరికోసం బ్రతకాలీ, రెక్కలుడికిన మేము ఎలా బ్రతకగలం పెద్దకొడుకు కోడలు కొండంత అండ జారిపోగా...'' తల్లి వెక్కి వెక్కి ఏడుస్తూ, ముక్కు చీదేస్తోంది, మధ్య మధ్యన ఆ ఏడుపులో!

ఆనందరావు భార్య ముఖం తుడుస్తూ- తనూ కళ్ళ నీళ్ళు పెట్టుకున్నాడు-

''ఏడవకే వర్ధనం.. ఏం చేద్దాం, ఈ స్థితి మనకే కాదు, తల్లిదండ్రులయిన అందరికీ. పిల్లల్ని కనీ, పెంచి, పెద్దచేసి, చదివించి, ఓ ఇంటివారిని కూడా చేసినందుకు- పిల్లలు, ఇచ్చే బహుమతి ఇదేనే. అవసరాలు తీరి రెక్కలు వచ్చేవరకేనే పిల్లలు తల్లిదండ్రుల పంచనుండేది. ఆ తర్వాత కట్టుకున్నవారితో రెక్కలు కట్టుకుని మరీ ఎగిరిపోతారు. ఆ సమయంలో ఈ తల్లితండ్రుల్ని ఎలాగయినా వదిలించుకోవాలనుకుంటారు'' అంటూ ఆయన ఆయాసపడుతూ ఆగితే- భర్త గుండెలని రాస్తూ ''బాధపడకంటూ నాకు చెప్పి, మీరు బాధపడటంలేదా? మీరన్నది చాలా నిజం! మనలాంటి అనాధ తల్లిదండ్రులెందరో ఉన్నారు. ఈ అనాథలకు మూలం పిల్లలే కదా! కొడుకులు మంచివారే అయినా కోడళ్ళు వచ్చి వారిబుద్ధిని మార్చేస్తుంటారు. మన అబ్బాయీ అందులో ఒకడు! ఏం చేస్తాం!'' కళ్ళు తుడుచుకుంటూ అంటూ వర్ధనమ్మ లేవబోయింది.

''నువ్వు కూర్చోమ్మా.. ఈపూటకి నేను వంటచేస్తాను.'' జయ అంది.

తల్లిదండ్రుల పరిస్థితి చూస్తే ఆమెకు ఏడుపూ, జాలీ కలిగాయి. తను మాత్రం ఏం చేయగలదు? ఎవరికి ఏం చెప్పగలదు. ఒకరికి బుద్ధీ సలహా చెప్పే పరిస్థితిలో ఉందా తను?!

'నువ్వు చేసింది ఏమిటీ? మొగుడ్ని వదిలీ రాలేదా? ఆ ముసలి తల్లిదండ్రులనీ చెల్లినీ తమ్ముడ్నీ వాళ్ళ ఖర్మాన వాళ్ళని వదిలేసి వేరింటి కాపురానికి వచ్చేయమనలేదా. అతను రానన్నాడనీ అలిగీ పుట్టిం



వీకి పేరుకో లేదా?" అంటే దానికి తనేం సమాధానం చెప్ప లేదు.

అందుకే, వాళ్ళ గొడవల్లో తనేం కలగజేసుకోలేదు. అన్నయ్య వంక కోపంగా చూసింది. అతనేం లెక్కచెయ్యలేదు ఆమె చూపుని. టైకట్టుకుని, బూట్లు వేసుకుని, బయటికి వెళ్ళిపోయాడు. వర్ధనమ్మ ఇంకా ఏడుస్తూనే ఉంది.

వంటా భోజనాల కార్యక్రమాలు ముగిసాయి. జయ పెట్టెతోసహా బయటికి వచ్చింది–

"అమ్మా, నాన్నా, నే వెళ్ళివస్తా" అంది.

"అదేమిటే?" అడిగింది తల్లి ఆశ్చర్యంగా.

"అదంతే.." అంటూ ఇద్దరి పాదాలకు నమస్కారం చేసి బయలుదేరింది.

• • •

ఆటో దిగి వస్తున్న జయని చూసి, అంతా ఆశ్చర్యపోయారు. వస్తూనే భర్తని క్షమించమనీ అడిగీ, అత్తమామలకు నమస్కరించింది పాదాలు తాకుతూ–

"నన్ను క్షమించండి, అత్తయ్యా–మామయ్యా.. ఇంకెప్పుడూ ఇలా ప్రవర్తించను. నా జీవితకాలము వేరుకాపురం కోరను. ఎప్పటికీ మనమంతా హాయిగా ఆనందంగా కలిసే ఒకే కుటుంబంగా ఉందాము. పూజకి మంచి పెళ్ళికొడుకుని చూసి పెళ్ళి జరిపించడం, రవిని పెద్ద చదువులు చదివించడం– మీరిద్దర్నీ కంటికి రెప్పలా చూసుకోటం, ఇంక మా ఇద్దరిదే బాధ్యత! ఈ బుద్ధి నాకెవరూ చెప్పి పంపిందికాదు. పరిస్థితులే నాలో ఈ పరివర్తన కలిగించాయి. ఈ నా యింటిని పెద్దకోడలిగా బాధ్యతగా చూసుకోటం, చక్కదిద్దుకోటం నా బాధ్యత–" అంటూ తన గదిలోకి వెళ్ళిపోయింది. అందరి ముఖాల్లో ఆమెలోని మార్పు ఆనందాన్ని వెల్లివిరిసేలా చేసింది.

• • •

"ఒరేయ్.. మోహన్ థాంక్స్‌రా, నా కుటుంబాన్ని నిలబెట్టావు. మా అందరికీ ఆనందాన్నీ, మనశ్శాంతినీ అందించావు" అంటూ కౌగిలించుకుని కళ్ళు తుడుచుకున్నాడు ఆనంద భాష్పాలు రాగా తుడుచుకుంటూ సుధీర్.

"ఒరేయ్.. నువ్వు నా చెల్లెలి మొగుడివే కానీ, ముందుగా నా ప్రాణస్నేహితుడివి. నీకిచ్చి పెళ్ళిచేస్తే అది సుఖపడుతుందనే ఆశతో ఈ పెళ్ళి జరిపించాను. అరుణతో, అమ్మానాన్నలతో, ఆలోచించి ఈ ప్లాన్‌చేసి ఈ నాటకం ఆడించి వాళ్ళచేతే, మొత్తానికి జయలో పరివర్తన కలిగేలా చేయగలిగాను. జీవితంలో అది ఇంక వేరింటికాపురం అనదు– అంటే, ఇక్కడ అదే జరుగుతుంది. అక్కడ అత్తమామలు కష్టపడితే ఇక్కడ అమ్మానాన్నలకు తప్పదు అదే కష్టం! అలా ట్రిక్ ప్లే చేస్తేకానీ అదోదారికిరాలేదు." అంటూంటే అమాంతంగా సుదీర్ మోహన్‌ని హత్తుకున్నాడు– "నువ్వు నా స్నేహితుడివి అయినందుకు గర్వపడుతున్నానురా" అంటూ.

★